# ఔన్నత్యం

## –చిత్తూరి కోటేశ్వరరావు

ఆగష్టు 15వ తేది

దేశమంతా స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలలో మునిగి తేలుతూ ఉన్న సమయం. జిల్లా కలెక్టరు నర్సింలు భార్య అరుణ లేడీస్ క్లబ్‌లో పతాకావిష్కరణ చేసి తన వాగ్ధాటితో అందరినీ ఆలో చింప జేసింది.

ఇతిహాసాల నుంచి నేటి దాకా సగటు స్త్రీ అనుభవిస్తున్న కష్టాలు అందరికీ అర్థమయ్యేలా చెప్పి కలెక్టర్‌గారి భార్య హోదాకు తాను అన్ని విధాల అర్హురాలు అన్పించుకొంది. కుల తత్వం, అసమానత్వం, అంటరానితనం, నిరాదరణ, నిస్సహా యత, లైంగిక వేధింపులు, వెక్కిరింతలు ఇలా ఎన్నో విషయా లపై అనర్గళంగా మాట్లాడింది.

చప్పట్లు మారుమ్రోగాయి.

ఆ సభకు విచ్చేసిన మహిళలు, మహిళాధ్యాపకులు ఆ ప్రసంగానికి ముగ్ధులై అభినందనలు తెలియచేశారు.

★★★

''ఏయ్ సెంట్రీ. గేట్ తీయకుండా ఏంటా కబుర్లు'' అంటూ బంగ్లా సెంట్రీపై తన అధికారాన్ని ప్రదర్శించింది అరుణ.

''అయ్యగారి బంధువులటమ్మ..గద్వాల నుంచి వచ్చా రట. అయ్యగార్ని కలవాలని అడుగుతున్నారు'' అంటూ గేటు తీయడంలో జరిగిన ఆలస్యానికి కారణం చెప్పాడు.

''అందరూ చుట్టాలే..అధికారంలో ఉంటే ప్రతి ఒక్కడూ బంధువే. అయినా నీకామాత్రం బుద్ధిజ్ఞానం లేదా? వాళ్ళు అయ్యగారికి ఎలా చుట్టాలౌతారు? మురికి ముఖాలు మురికి బట్టలు ముందు వాళ్ళని బయటకు పంపేయ్..అయ్యగారొస్తారు గేటు తెరిచిపెట్టు'' అని డ్రైవర్ వంక తిరిగి ''ఏం నిద్రపోతున్నావా?'' అని మందలించింది.

డ్రైవర్ యాదన్న తుళ్ళిపడి కారుని బంగాళాలోకి పోని చ్చాడు.

''ఈ చుట్టాలతో, బంధువులతో పెద్ద చావొచ్చి పడింది. ప్రతి అడ్డమైన వాడు బంధువే'' అంటూ రుసరుసలాడుతూ సోఫాలో చతికిలబడింది.

డ్రైవర్ యాదన్న గేటు దాకా వచ్చి ఇంకా అక్కడే వున్న వాళ్ళిద్దర్ని పరామర్శించి, చేతిలో వంద రూపాయలు పెట్టి ''రేపు ఆఫీస్‌లో కలెక్టర్ గార్ని కల్సుకోండి'' అని సలహా ఇచ్చాడు.

★★★

తండ్రితో కల్సి తిరుగుముఖం పట్టిన లక్ష్మమ్మ కలెక్టర్ నర్సింలుకి స్వయాన అక్క బిడ్డ. పుట్టినపుడు నర్సింలు భార్య అని అందరిచేత పిలిపించుకొంది. ముందు ముందెలా ఉంటుందోనన్న ఆలోచనతో ఆమె పెద్దవాళ్ళు ముహూర్తాలు కూడా పెట్టటానికి నిశ్చయించుకొన్నారు. కానీ బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని తెల్సి ఆగిపోయారు.

నర్సింలు తండ్రి అనంతయ్య మనసులో వేరే ఆలోచన ఉండి తతంగాన్నంతా చూస్తూ మౌనంగా నవ్వుకున్నాడు.

అది జరిగిన కొద్దిరోజుల తర్వాత...గద్వాలలో ఉన్న గణ పతిశాస్త్రి ఇంటికి నర్సింలుని తీసుకెళ్ళి ఆయనతో కొడుకు చదువు సంధ్యల బాధ్యత తీసుకోమని వేడుకొన్నాడు. శాస్త్రి గార్కి అంటరాని తనం పట్టింపులు లేకపోవడంతో అందుకు అంగీకరించాడు.

కాలక్రమేణా నర్సింలు అదృష్టయోగం మారుతూ వచ్చింది.

నర్సింలు హైదరాబాద్ నగరంలో అడుగు పెట్టాడు. తన జీవిత ధ్యేయాన్ని సాధించటానికి యజ్ఞం చేశాడు. గణపతి శాస్త్రి తదితరులు హోమం చుట్టూ నిలబడ్డారు. నర్సింలు పేరు ఐ.ఎ.ఎస్ లిస్ట్‌లోకి ఎక్కింది. అతని ఆనందానికి అవధు ల్లేవు.

కష్టాల కడలిలో బాధలకు వెరవక ఈదే వాడికి సుఖాల తీరం దొరకుతుందన్న దానికి- అతనొక సాక్ష్యం అయ్యాడు.

గమ్యం చేరడానికి హైదరాబాద్‌కొచ్చిన అతని గతంలో ఎన్నో గాయాలూ..గాధలు.

శాస్త్రిగారు కలవమని చెప్పిన వ్యక్తి ఇంట్లో లేకపోవడంతో దిక్కుతోచని నర్సింలు ఆ ఇంటి వరండాలో కూలబడ్డాడు. ఎటు వెళ్ళాలన్నా దారి తెలీదు. చేతిలో రెండు రూపాయలు మాత్రమే ఉన్నాయి. ఆకలి చంపుతోంది. చలి కూడా వదిలి పెట్టకుండా పీడిస్తోంది. నీటితో కడుపునింపుకుందామని అటూ ఇటూ వెతికాడు. ప్రయోజనం లేకపోయింది. మళ్ళీ మండువా లోగిలిలోనే జారగిలబడ్డాడు. చుట్టూ నిశ్శబ్దం...ఆకలికి తట్టుకోలేక తిరిగి రోడ్డెక్కాడు శక్తి కోద్దీ నడు స్తున్నాడు. అంతలో పోలీస్ విజిళ్ళు చుట్టుముట్టాయి. నర్సింల్ని శ్రీకృష్ణ జన్మస్థానం వరించింది. అప్పుడే సెంట్రీ డ్యూటీ మారిన కానిస్టేబుల్ సదానంద నర్సింలుని గుర్తుపట్టక పోతే నర్సింలు ఏమయ్యేవాడో!?

ఆ సదానందమే నర్సింలుకి ప్రెస్‌లో ఉద్యోగమిప్పించి జీవితంలో కొత్తమలుపునకు కారణమయ్యాడు. ఉద్యోగం చేస్కుంటూ తను కన్నకలల్ని నిజం చేసుకోవడానికి నర్సింలు తెగ కష్టపడుతుండగా..వింతలు చేసే విధి అతని జీవితంలో వేగం పెరగటానికి ఇంకో వ్యక్తిని ప్రవేశపెట్టింది.

ఒకరోజు జీతం డబ్బులు లెక్కపెట్టుకొంటూ ఇంటికి వస్తున్న నర్సింల్ని ఇద్దరు వ్యక్తులు కత్తి చూపించి డబ్బులు కాజేశారు. సరిగ్గా ఆ సమయంలో అటుగా జీప్‌లో వెళ్తున్న యాదన్న తన జీప్‌ని ముందు కురికించి వాళ్ళ నుంచి డబ్బులు కక్కించాడు. ఆ యాదన్న ఎవరోకాదు నర్సింలు ఊరివాడే చిన్నతనంలో దరిద్ర తాండవానికి తట్టుకోలేక ఊరు విడిచి మిలిట్రీలో చేరి, తిరిగొచ్చి డ్రైవర్‌గా ఉంటున్నాడు.

అలా నర్సింలు జీవనరథాన్ని ముందుకు నడిపించ డంలో సదానంద్, యాదన్న చెరో రథ చక్రమయ్యారు.

సాధించదలుచుకున్న గమ్యం కోసం జాగ్రత్తగా, కసిగా అడుగులు కదిపాడు. అందలాల బాటలో పడ్డాడు. అభినం దనల చినుకులు కురిసి కురిసి..ఉధృతమై..ఉప్పెనలా మారాయి. నర్సింలు తేరుకోలేకపోయాడు.

ఉప్పెన చల్లారింది. నర్సింలు జన్మస్థలం మాట మర్చి పోయి 'ముస్సోరీ' కలెక్టర్ ట్రైనింగ్‌కి వెళ్ళాడు.

ట్రైనింగ్‌లో జీవిత పాఠాలెన్నో నేర్చుకొన్నాడు. కొత్తనీరు అమితరుచిగా తోచింది. తన రంగు, వాతావరణం పై

అసహ్యం పెరిగి ఏదో మార్పు కావాలనుకున్నాడు.

మారుతున్న అతని ఉనికిలో సదానంద్, యాదన్నల పాత్ర సామాన్యుల స్థాయికి దిగజారింది.

అదే తరుణంలో తన తల్లి చావు అతని జీవితాన్ని కొత్తది శకు మార్చింది. మర్చిపోయిన గద్వాల్‌ని మళ్ళీ స్మృతిపథంలోకి తెచ్చింది.

అడపాదడపా తాను పంపే డబ్బుతో తండ్రి అనంతయ్య గుట్టుగా ఇల్లు గడుపు తుండే వాడు. ఉన్న రెండు కుంటల పొలం చెల్లి పెళ్ళికి చెల్లయిపోయింది. పెదక్క, ఆమె భర్త వ్యవసాయం చేసుకుంటూ తండ్రితోనే ఉంటున్నారు.

పదేళ్ళలో ఎన్నో మార్పులు...బస్సు ఊరి మధ్యలో ఆగింది. అంతకు ముందయితే ఆరుమైళ్ళు నడవాల్సి వచ్చేది.

అంత్యక్రియలు అయిపో యాక, పరా మర్శలకు పల్లెలో తిర గడం మొద లెట్టాడు.

''ఏరా! నర్సింహ బాగు న్నావా..'' అని కొందరు

''పదేళ్ళకంటరా ఈ ఊరొచ్చేది..'' అని కొందరు


''కలెక్టర్ అయ్యావంటగా..ఇక నీకు మేం కన్పి స్తామా!'' అని కొందరు...ఆప్యాయతలు, అవహేళనలు కలగలిపి మాట్లాడారు. ఊరంటే ఉన్న అయిష్టత మరింత ఎక్కువైంది. ఉపశమనం కోసం గణపతిశాస్త్రిగారింటి వైపు కదిలాడు.

''మనిషన్నాక సుఖఃదుఖాలకు అలవాటు పడాలి. అంతే గాని దూరంగా అతీతుడిగా జీవించడం ధర్మం కాదు. మహోన్నతమైన పదవి లభించింది. చిన్నా, పెద్దా తారత మ్యాన్ని విస్మరించొద్దు. పదేళ్ళుగా ఊరికి రాకపోవడం నువ్వు చేసిన తప్పే'' ఊరి వాళ్ళ మాటలకి భాష్యం చెప్పారు శాస్త్రి గారు...

నర్సింలులో మౌనం తప్ప మరే చర్యా కనపడ్లేదు.

తాగటానికి కాఫీ ఇచ్చిన అరుణను చూసిన తర్వాత నర్సింలుకి మళ్ళీ తన రంగు గుర్తుకొచ్చింది.

''ఎన్ని రోజులుంటావ్.. మీ తండ్రి నీకోసం ఎంతగానో కష్టప డ్డాడు. నువ్వు హైదరాబాద్‌లో కష్టాలు అనుభవించలేదని నేనను కోను. కానీ నీ ధర్మాన్ని నువ్వు సక్ర మంగా నిర్వర్తించాలి కదా!'' శాస్త్రి గారి హితవచనాలు విసుగనిపించి లేచి ఆయనకు నమస్కారం చేసి, అరుణతో వెళ్ళొస్తానన్నట్టు తలూపి ఇంటిదారి పట్టాడు.



ఆ రాత్రంతా ఆలోచనలు.. ''ఎంత అభ్యుదయం ఉన్నా.. ఔన్నత్యం ఉన్నా, ఎన్ని ఏళ్ళు గడిచినా సమాజంలో వచ్చిన మార్పు ఒక నూలుపోగు మాత్రమే. అధికారం ఉందని అంతస్తు చూపిస్తున్నారే కాని ఆ అంతస్తు కూడా మయసభ లాంటిదే. రంగు చూసి కులాన్ని గుర్తిస్తుంది లోకం. ఆ రంగు మారితేనే మార్పు సాధ్యమేమో!

లక్ష్మమ్మని జీవిత భాగస్వామిగా ఊహించుకొన్నాడు. ఆమె రంగు కూడా తన రంగే...ప్చ్..లాభం లేదు. తనకు కావల్సింది నవ వర్ణ మిళితమైన భవిష్యత్. అది అరుణ తోనే సాధ్యం. శాస్త్రి గారికెటూ అంటరానితనం లేదు. కాని అరుణ సంగతే తెలీదు. అరుణకే గనక ఆ ఆలోచన ఉంటే గ్లాసు చేతి కివ్వకుండా కిందపెట్టేదిగా..

ఆలోచనలు క్రియారూపం దాల్చాలంటే ఏం చేయాలో నిర్ణయించుకొని నిశ్చింతగా నిద్రపోయాడు.

ఊరి వాళ్ళ ఊహకందని రీతిలో...అరుణ నర్సింలు భార్య అయింది. సూత్రధారిగా శాస్త్రిగారి దూరపు బంధువైన తాశీల్దారు నిలిచాడు.

★★★

వంద రూపాయి లిచ్చి లక్ష్మమ్మ, మల్ల య్యల్ని బయటికి పంపిన యాదన్న మాత్రం మనిషి మనిషిగా లేడు...వాళ్ళెక్కడకెళ్ళారో అన్న ఆరా టంతో..చివరకు వాళ్ళని వెత కటానికి బయల్దేరాడు.

నర్సింలు ఊహించిన జీవితం అతనికి వచ్చిందేమోగాని, అతనంటే బంధువులెవరికీ సుముఖత, నమ్మకం రాలేదు. చివరకు సదానంద్ విషయంలో కూడా అంతే జరిగింది.

''పదేళ్ళుగా కానిస్టేబుల్‌గా చేస్తున్నాను.. నా ప్రమోషన్ విషయంలో కాస్త మా డి.సి.పి. గార్కి చెప్పు'' అని అడిగితే.

''మీ డిపార్ట్‌మెంట్ వేరు..మా డిపార్ట్‌మెంట్ వేరు..పైగా రికమెండేషన్ చేయడం నా అభిమతానికి విరుద్ధం. యు కెన్ గో'' అని తెల్చి చెప్పేసరికి..సదానంద్ చిన్నబుచ్చుకొని వెళ్ళి పోయాడు.

దారిలో కల్సిన యాదన్న దగ్గర తన గోడు వెళ్ళబోసుకు న్నాడు. సదానంద్.

''అంతేరా! నేను కూడా సర్కారీ నౌకరీ కోసం ఓ మాట చెప్పమంటే చెప్పకుండా..నాకిక్కడ ఉద్యోగమిప్పిచ్చాడు''


''అంటే నువ్వు సర్కారు కార్ డ్రైవర్ కాదా!?''


''నేను తోలేది కలెక్టరు గారి కారెందుకైంది..అరుణ మ్మగారి కారు..''

సదానంద్‌కి విషయం అర్థమై విస్తుబోయాడు.

''వస్తారా'' అంటూ కదుల్తున్న సదానంద్‌ని ఉద్దే శించి యాదన్న అన్నాడు.

''వీడేమో ఇల్లు చేస్తున్నాడు. వీడి పెళ్ళామేమో వీడక్క




బిడ్డ లక్ష్మమ్మని సెంట్రీచేత బయటికి గెంటించింది. వాళ్ళెటు పోయింద్రో..వెతికి ఇంటికి తీసుకుపోవాల''

★★★

''అయ్యా! తమరికోసం గంట నుంచి ఇద్దరు వెయిట్ చేస్తున్నారు'' అని బంట్రోతు చెప్పగానే.

''సరే..పిలు'' అన్నాడు నర్సింలు..లోనికి వచ్చిన వాళ్ళను చూసి ఎలా వున్నారని పరామర్శించకుండానే..

''ఏం కావాలి? మీకు..'' సూటిగా అడిగాడు.

''ఏరా..అంత గుర్తులేకుండా ఉన్నామా! నేను మీ బావ మల్లయ్యని రా..'' అంటున్న బావని మరోమాట మాట్లాడనీయకుండా..

''త్వరగా చెప్పండి. చాలా పన్లున్నాయి'' అన్నాడు.

మల్లయ్యలోని కోపం పెల్లుబికింది. పరిస్థితిని అర్థం చేసుకున్న లక్ష్మమ్మ తండ్రిని బయటికి ఈడ్చుకొని పోయింది.

''ఛూ...ఈడవ్వా.... ఎంత కలెకటరు ఐతే మాత్రం మరీ అంత పొగరా!'' అంటూ పెద్దగా లొల్లి చేశాడు.

అంతలో ''అమ్మా....మిమ్మల్ని అయ్య గారు లోపలికి రమ్మన్నారు'' బంట్రోతు వచ్చి చెప్పాడు.

''అయ్యా..లొల్లి చేస్తే బావకి చెడ్డపుద్ది. నేను మాట్టాడతా నువ్వూరుకో'' తండ్రిని సముదాయించి లోనికెళ్ళింది.

''మీ నాన్నకి ఏం కావాలి?'' నర్సింలు కరకుగా అన్నాడు.

''మా నాయనకేమీ వద్దుసార్..నాకే కావాలి..నన్ను మనువాడిన ఆయన బస్సు డ్రైవర్‌గా చేస్తూ ఏక్సిడెంట్‌లో చచ్చిపోతే..నాకు ఉద్యోగమిస్తారని అన్నారు గాని ఇంతవరకు ఇవ్వలేదు సార్. మీరు దయతలచి నాకేదైనా దారి చూపిస్తారని వచ్చాం సార్..మీ ఏలుబడిలో నౌకరీలు ఉంటాయి కదా! సార్..దయతలుస్తారని ఆశతో వచ్చాం..ఇంటికాడకొస్తే అమ్మగారు మమ్మల్ని బయటికి గెంటించింది సార్..అయినా అక్కబిడ్డ బంధువు లెక్కలోకి రాదాసార్..'' కన్నీటిని నొక్కిపట్టి, ఒత్తిపల్కింది.

జరిగిందంతా అరుణ తెల్సుకొంది.

★★★

వ్యవహారం అంతా సద్దుమణిగిందని అనుకున్నాడు నర్సింలు.

''మీరు లక్ష్మమ్మకి ఉద్యోగం ఎందుకిస్తున్నారో నాకు బాగా అర్థమైంది. మొగుడులేని దాన్ని ఎలాగైనా దగ్గర చేసుకోవాలని మీ తాపత్రయం..ఎంతైనా రక్త సంబంధం..ఒకప్పుడు పెళ్ళాడాలనుకున్నారే..మీరంగే...రంగుకోసమే కదా! నన్ను పెళ్ళి చేసుకున్నారు.'' అరవడం ఆపి మళ్ళీ మొదలెట్టింది.

''మర్యాదగా చెబుతున్నా నర్సింలు గారు..దానికి నువ్వు ఉద్యోగం ఇచ్చావంటే..ఎంత లొల్లి చెయ్యాలో అంత చేసి..మీ బ్రతుకు బజారు కీడుస్తాను. జాగ్రత్త..'' సంస్కారం వదిలేసి బెదిరించింది.

రెండు రోజుల క్రితం 'లేడీస్ క్లబ్'లో మాటల ద్వారా 'ఔన్నత్యం' చాటుకున్న తన సతీమణి ఇవాళ బరితెగించి మరీ ఇలా మాట్లాడ్డం వింతగా తోచింది నర్సింలుకి..ఏ ఉద్దేశంతో అరుణని పెళ్ళి చేసుకున్నాడో..అది కేవలం, ఒక ఊహ నని..వివాహం జరిగిన బహుకొద్దికాలంలోనే తెల్సుకోగల్గాడు. మాట మాటకి 'ఔన్నత్యం' అనే అరుణ, కేవలం అవకాశావాది, అందలం కోసం ప్రాకులాడే మామూలు స్త్రీ.

సంసారంలోని గుట్టు బయటకు రాకుండా..నా అనే వాళ్ళనందరినీ దూరంగా పెట్టాడు.

స్వాతంత్ర్యదినోత్సవం నాటి అరుణ ప్రసంగం విని చాలా మారిందను కొన్నాడు. అదంతా భ్రమ.

''మీ నిర్ణయం త్వరగా తెలియ చెయ్యండి..నర్సింలు గారు'' అంటున్న అరుణ మాటలకి ఉలిక్కిపడ్డాడు. అంతలో

''సార్ పి.ఎ గారు మీకీ కవరిచ్చారు'' చెప్పాడు బంట్రోతు.

''కలెక్టర్ గార్కి,

సార్..నాకు మీరిచ్చే ఉద్యోగం అక్కర్లేదు, మీరు అనుభవిస్తున్న వ్యధ యాదన్న చెప్పాడు. అతను మీ కారు డ్రైవర్ ఉద్యోగం మానేసి మాతో వస్తున్నాడు. మేం ముగ్గురం వెళ్ళి పొలం చేసుకుంటూ గద్వాలలోనే బతకాలని నిశ్చయించుకొన్నాం..అలాగే ముసలితనంలో ఉన్న మీ నాయన సంగతి కూడా మేమే చూసుకుంటాం. మీరు హాయిగా, నిశ్చింతగా అమ్మగారితో ఉండండి..తొందరపడి కాపురం పాడు చేసుకోవద్దు-

ఇట్లు


మీ అక్కబిడ్డ

-లక్ష్మమ్మ''

అరుణ ప్రశ్నకి సమాధానంగా ఉత్తరం ఆమె చేతిలో పెట్టి విసురుగా అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు కలెక్టర్ నర్సింలు.

★

## బిగ్ బి దశ తిరిగేనా?



మేజర్ హిట్ అవుతుందనుకున్న అమితాబ్ చిత్రం 'మేజర్ సాబ్' మేజర్ ఫ్లాప్ కావడంతో రోజులు మనవి కానప్పుడు ఎక్కడ కాలు పెట్టినా 'మటాష్' అనేది రుజువైనట్టయింది. ప్రస్తుతం అమితాబ్ టైమ్ బాగోలేదనే చెప్పాలి. ఏ చిత్రమూ హిట్ కావడం లేదు. అయితే ఓ ప్రత్యేకత ఏంటంటే- అతనికి సినిమా చాన్స్‌లు రావడం మాత్రం ఆగడం లేదు. వాటిలో అనిల్ కపూర్‌తో కలిసి నటించే చిత్రం ఒకటుందిట. గతంలో అమితాబ్ నటించిన 'శక్తి' అనే చిత్రంలో అనిల్ కపూర్ నటించాడు. అయితే అందులో అమితాబ్ పాత్ర ముగిశాక అనిల్ వస్తాడు. అందువల్ల కలిసి నటించినట్టు కాదు. ఇప్పుడు హీరోలుగా ఇద్దరూ ప్రాధాన్యతగల పాత్రల్ని పోషిస్తున్నారట. అనిల్ కెరీర్ కూడా అంతంతమాత్రంగానే వుందిప్పుడు. అమిత్-అనిల్‌ల కాంబినేషన్ మరి హిట్టయ్యేనా?

-జె.ఎం.